క్లుప్తంగా

పాదగయను దర్శించుకున్న కలెక్టర్


కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న కలెక్టర్ షణ్మోహన్

పిఠాపురం: పవిత్ర పాదగయ క్షేత్రాన్ని బుధవారం కలెక్టర్ షణ్మోహన్ దర్శించుకున్నారు. కుక్కుటేశ్వరస్వామిని, రాజరాజేశ్వరిదేవిని, పురూహూతికా అమ్మవారిని ఆయన దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా మహా శివరాత్రి ఉత్సవాలు అవాంఛనీయ సంఘటనలు లేకుండా, ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన అధికారులను ఆయన అభినందించారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కొత్తపల్లి: కొనపాపపేట సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం డివిజన్ ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకరావు బుధవారం తెలిపారు. శ్రీరాంపురం, ముమ్మిడివారిపోడు, కొనపాపపేట, మల్లివారితోట, రావివారిపోడు, రామరాఘవపురం గ్రామాలతో పాటు, శ్రీరాంపురం, రమణక్కపేట, నాగులపల్లి చెరువులకు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఆర్డీఓ కార్యాలయ ఉద్యోగి రాజు మృతి


దయానందరాజు (ఫైల్)

పెద్దాపురం: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడి, ఇటీవల విధుల్లో చేరిన పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ సీనియర్ సహాయకుడు చప్పిడి దయానందరాజు (52) బుధవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. మండలంలోని జి.రాగంపేటకు చెందిన దయానందరాజు కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడినా, ఇటీవల విధుల్లో చేరారు. బుధవారం ఉదయం ఆర్డీఓ కార్యాలయంలో విధులకు బయలుదేరుతుండగా, గుండెపోటు రావడంతో అక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతికి ఆర్డీఓ కె.శ్రీరమణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి, కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, ఇతర సిబ్బంది సంతాపం ప్రకటించారు.

తూరంగేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తజనం

కాకినాడ సిటీ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని తూరంగేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ, దేవస్థానం వారు భక్తులకు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఈఓ శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండల అధికారులు

తహసీల్దార్	91542 47464
ఎంపీడీఓ	94401 13090
ఇంజినీర్	99890 78030
ఎలక్ట్రికల్ ఏఈ	94408 12642
హౌసింగ్ ఏఈ	70939 30455
ఈఓపీఆర్డీ	99489 27333
ఉపాధి హామీ పథకం ఏపీఓ	83744 46378
డ్వాక్రా ఏపీఎం	89788 81622
ఎస్సై	94409 00752
సీఐ పిఠాపురం	94407 96523
వ్యవసాయ శాఖ ఏఓ	83310 56594
కొత్తపల్లి పీహెచ్‌సీ డాక్టర్	99890 69546
నాగులపల్లి పీహెచ్‌సీ డాక్టర్	98497 28671
కొమరగిరి పీహెచ్‌సీ డాక్టర్	92466 90633
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	89858 28380
ఎంఈఓ	92467 34465
ఐసీడీఎస్ సీడీపీఓ	94408 14692
ఇరిగేషన్ జేఈ	83310 75078

సామర్లకోట అధికారులు

మున్సిపాలిటీ	
మున్సిపల్ కమిషనర్	98499 05808
మున్సిపల్ మేనేజర్	98499 07118
మున్సిపల్ డీఈ	96769 68282
మున్సిపల్ ఏఈ	98499 07122
మున్సిపల్ ఆర్వో	98499 07120
మున్సిపల్ ఆర్ఐ	90146 00920
మున్సిపల్ టీపీఓ	98499 07123
శానిటరీ ఇన్‌స్పెక్టర్	77024 48282
అకౌంట్స్ ఆఫీసర్	98499 02447
ప్రభుత్వాస్పత్రి	
సూపరింటెండెంట్	80082 88125
పశు సంవర్థక శాఖ ఏడీ	94418 60299
తహసీల్దార్	98499 03876
ఎంఈఓ-1	85558 71069
ఎంఈఓ-2	94410 73418


స్నానం సమర్పయామి: పాదగయ పుష్కరిణిలో ఉత్సాహంగా చిన్నారుల పుణ్య స్నానాలు


పిఠాపురం పాదగయలో భక్తుల క్యూ


పాదగయ క్షేత్రంలో భక్తుల రద్దీ


జలకాలాట: పాలగయ పుష్కరిణిలో యువకుల కేరింతలు

హరహర మహాదేవ

- పాదగయకు పోటెత్తిన భక్తులు
- కిటకిటలాడిన పిఠాపురం
- మార్మోగిన శివ నామస్మరణ

పిఠాపురం: గయాసురుని పాదాలున్న పాదగయలో మహా శివరాత్రి పర్వదినం నాడు పుణ్యస్నానమాచరిస్తే సకల పాపాలు తొలగిపోతాయన్న నానుడితో అశేష భక్త వాహిని ఇక్కడి పుష్కరిణికి తరలివచ్చింది. హరహరమహాదేవ శంభోశంకర అంటూ భక్తులు చేసిన శివనామస్మరణలు పాదగయ క్షేత్రంలో మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినం కావడంతో బుధవారం మూడు లక్షల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తరలిరాగా, పిఠాపుర పట్టణం భక్తులతో నిండిపోయింది. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు దేవాలయంలోని కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరి, పురుహూతికా అమ్మవార్లు, దత్తాత్రేయస్వామి, సాయిబాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కొంతమంది గంగామాతకు దీపారాధనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ క్యూలైన్లలో భక్తులు తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు బారులు తీరి, స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ, పరిసర ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. బుధవారం తెల్లవారుజామున ఒంటిగంట నుంచి స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. తెల్లవారుజామున రెండు నుంచి కుక్కుటేశ్వరస్వామి భక్తులకు నిజరూప దర్శనమిచ్చారు. రాత్రి స్వామికి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించారు. మహా శివరాత్రి సందర్భంగా పాదగయ క్షేత్రంలో స్వామివారిని పలువురు న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, అధికారులు దర్శించుకున్నారు. భక్తులు వివిధ వాహనాలపై పాదగయకు తరలిరావడంతో 216 జాతీయ రహదారితో పాటు, ఉప్పాడ-సామర్లకోట రోడ్డుపై ట్రాఫిక్ జాం ఏర్పడింది. స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు మంచినీరు, మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని సోమేశ్వర స్వామి, సకలేశ్వరస్వామి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మార్మోగిన శివ నామస్మరణ

కొత్తపల్లి: మహా శివరాత్రి సందర్భంగా బుధవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. స్థానిక ఊర చెరువు సెంటర్ వద్ద ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వర స్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, మూలపేట, ఎండపల్లి, గోర్స, కొమరగిరి, నాగులాపల్లిలోని ఉమారామలింగేశ్వర స్వామి, అమీనాబాద్‌లో గంగా గౌరీ గణపతి సమేత మల్లేశ్వర స్వామి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. విష్ణు సహస్రనామ, లలితా పారాయణం, ప్రత్యేక పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

రథోత్సవానికి రథం ముస్తాబు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో బాలత్రిపుర సుందరి, కుమారారామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం నిర్వహిస్తున్నారు. స్వామివారి కల్యాణం అనంతరం మూడో రోజైన గురువారం రథోత్సవం నిర్వహిస్తారు. ఈ క్రమంలో రథానికి రంగులు వేసి, పూలతో, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి, ఆలయం నుంచి గాంధీచౌక్‌కు తీసుకొస్తారు. బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, సాంస్కృతిక ప్రదర్శనల మధ్య అక్కడి నుంచి పెద్దవీధి, బళ్ల మార్కెట్ సెంటర్, గణపతి ఆలయం మీదుగా గొల్లగూడెం, నీలమ్మ చెరువు, దేవీచౌక్ నుంచి తిరిగి గాంధీచౌక్ చేరుతుంది. గురువారం అర్ధరాత్రి భారీ ఎత్తున బాణసంచా కాలుస్తారు.


పాదగయ పుష్కరిణిలో పుణ్యస్నానాలకు తరలివచ్చిన భక్త జనం


ఆలయం వెలపల శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు


దీవెనలందుకుంటూ..

జల్లు స్నానంలో 'నిర్లక్ష్య' తుంపర్లు

పిఠాపురం: పాదగయ క్షేత్రానికి పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జల్లు స్నానాలకు ఒక్క చుక్క కూడా భక్తులపై నీటిని విదల్చలేదు. లక్షలాది మంది భక్తులు సుమారు 12 గంటల పాటు పుణ్య స్నానాలు ఆచరించగా, జల్లు స్నానాలు పని చేయకపోవడంతో పాదగయ పుష్కరిణిలోనే స్నానాలు ఆచరించారు. ఈ ఏడాది కొత్తగా జల్లు స్నానాలు ఏర్పాటు చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యం కల్పించామని బాహాటంగా చెప్పిన అధికారులు, వాటిని వినియోగంలో పెట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.


ఉప్పాడలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి


కొత్తపల్లిలో బాలాత్రిపుర సుందరి సమేత రాజశేఖర స్వామికి ప్రత్యేక పూజలు


సామర్లకోట గాంధీచౌక్‌లో రథోత్సవానికి సిద్ధమవుతున్న రథం


పాదగయ పుష్కరిణి వద్ద అలంకార ప్రాయంగా మారిన జల్లు స్నానాలు


పుణ్యం కోసం.. పొట్టకూటి కోసం..

భక్త జనసంద్రం.. పంచారామ క్షేత్రం

- వివిధ స్వచ్ఛంద సంస్థల సేవలు
- పాలు, మజ్జిగ, అల్పాహారం, భోజనాల ఏర్పాట్లు

సామర్లకోట: మహా శివరాత్రిని పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన బాలత్రిపుర సుందరి సమేత కుమారారామస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా వివిధ సేవా సంస్థలు భక్తులకు సేవలు అందించడానికి పోటీ పడ్డాయి. మాఘ త్రయోదశి రోజున వచ్చిన మహా శివరాత్రి కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రతి ఒక్కరూ క్యూలోనే దర్శనం చేసుకునేలా ఆలయాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోదావరి కాలువ, ఆలయ పుష్కరణిలో భక్తులు పుణ్యస్నానాలు చేశారు. లయన్స్ క్లబ్, ఉప్పువారి సత్రం, కొండపల్లి కృష్ణమూర్తి బ్రదర్స్ తదితరులు పాలు, రొట్టెలు మజ్జిగ, పులిహోర, అల్పాహారం, తాగునీటిని భక్తులకు అందజేశారు. అదేవిధంగా వాసవీ యూత్ అండ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో సుమారు 25 వేల మందికి, కర్రి వెంకట్రాజు పేరున 30 వేల మందికి, స్థానిక నూకాలమ్మ ఆలయం వద్ద మట్టపల్లి కుటుంబ సభ్యులు 10 వేల మందికి అన్నదానం చేశారు. వేట్లపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎస్పీ బిందు మాధవ్ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. డీఎస్పీ డి.శ్రీహరిరాజు పర్యవేక్షణలో సీఐలు ఎ.కృష్ణభగవాన్, అంకబాబు ఆధ్వర్యంలో భారీఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే చిన రాజప్ప, దేవదాయ శాఖ రీజనల్ కమిషనర్ సుబ్బారావు, కలెక్టర్ షణ్మోహన్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. సిఫార్సులతో ఆలయానికి వచ్చిన వారికి పోలీసులు చెక్ పెట్టారు. అందరూ క్యూలోనే రావాలని స్పష్టం చేశారు. వీఐపీలకు పోలీసు, రెవెన్యూ అధికారులు ప్రొటోకాల్ ఏర్పాటు చేశారు. గోదావరి కాలువ ఆవలి వైపు ఆలయం ఉండటంతో వంతెనలు దాటి భక్తులు తరలివచ్చారు. అలాగే పట్టణంలోని అన్నపూర్ణ సమేత రామలింగేశ్వర స్వామి, చౌడేశ్వరీ సమేత రామలింగేశ్వర స్వామి, చంద్రశేఖర స్వామి ఆలయాలను భక్తులు దర్శించారు. వేట్లపాలెం, పీబీ దేవంలోని శివాలయాల్లో భక్తులు బారులు తీరారు.


పంచారామ క్షేత్రంలో స్వామివారిని దర్శించుకుంటున్న కలెక్టర్ షణ్మోహన్

క్యూలో భక్తులు

మాఘత్రయోదశి రోజున వచ్చిన మహా శివరాత్రి కావడంతో భక్తులు పంచారామ క్షేత్రానికి బారులు తీరారు. భక్తుల కోసం ఉచిత, రూ.20, రూ.50, రూ.100 క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కంటే బాబు, ఈఓ బళ్ల నీలకంఠం, ఉత్సవాల ప్రత్యేకాధికారి కేవీ సూర్యనారాయణ, తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు. తెల్లవారుజామున కుమారారామ భీమేశ్వర స్వామివారికి అభిషేకాలు, అనంతరం స్వామి, అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిని ప్రత్యేకంగా అలంకరించారు.


శంభో శంకర..

పెద్దాపురం: అత్యంత భక్తి శ్రద్ధలతో శివనామస్మరణ చేస్తూ పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో బుధవారం మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, పరమేశ్వరుడి సేవలో తరించారు. స్థానిక శివాలయంతో పాటు, కాండ్రకోట, గుడివాడ, తిరుపతి, దివిలి, ఆర్‌బీ పట్నం, ఆర్‌బీ కొత్తూరు, కట్టమూరు గ్రామాల్లోని ఆలయాలు శివ నామ స్మరణతో మార్మోగాయి. భక్తులకు ఆలయాల కమిటీలు ఏర్పాట్లు చేశాయి. స్థానిక శివాలయంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. భజన సంఘాల వారు శివనామ సంకీర్తనలు ఆలపించారు. భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో మహా శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక సత్తిరెడ్డిపేటలో గీతా పారాయణాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం విఘ్నేశ్వర పూజ, గీతా పారాయణ ప్రవచనం, సంకీర్తన, శాంతి మంత్రాలతో ప్రవచించారు.


పంచారామ క్షేత్రంలో రూ.వంద టిక్కెట్ల క్యూలో నిలబడిన భక్తులు


ప్రత్యేకాలంకరణలో పంచారామ క్షేత్రంలోని స్వామివారు


పంచారామ క్షేత్రంలో బంగారు కిరీట అలంకరణలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు


పెద్దాపురం శివాలయంలో ఉమారామలింగేశ్వరుడు

సమర్థంగా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ


పోలింగ్ సామగ్రి పంపిణీ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ


ఆర్డీఓ కార్యాలయం నుంచి పోలింగ్ కేంద్రాలకు బయలుదేరిన బస్సులు


కొత్తపల్లి జెడ్పీ స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

- ఆర్డీఓ శ్రీరమణి
- పోలింగ్ సిబ్బందికి సామగ్రి అందజేత

పెద్దాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి సిబ్బందికి నిర్దేశించారు. ఈ నెల 27న డివిజన్‌లో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియకు సామగ్రిని బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీరమణి మాట్లాడుతూ, డివిజన్‌లో 31 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి సిబ్బందికి సామగ్రిని అందజేశామన్నారు. సిబ్బంది తరలింపునకు ఏడు రూట్లను ఏర్పాటు చేశామన్నారు. రూట్-1లో జగ్గంపేట, గండేపల్లి మండలాల్లో 13, 14, 15, 42, 43 పోలింగ్ కేంద్రాలు, రూట్-2లో ఏలేశ్వరం మండలంలోని 16, 17, 18, రూట్-3లో కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లోని 34, 35, 19, 20, రూట్-4లో శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని 21, 22, 23, 24, రూట్-5లో తుని మండలంలోని 27, 28, 29, 30, 31, రూట్-6లో తొండంగి, కోటనందూరు మండలాల్లోని 32, 33, 25, 26, రూట్-7లో పెద్దాపురం మండలంలోని 36, 37, 38, 39, 40, 41 కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అనంతరం పోలింగ్ సామగ్రి, సిబ్బందిని బస్సుల్లో తరలించారు.

మూడు కేంద్రాల్లో పోలింగ్

కొత్తపల్లి: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తహసీల్దార్ జి.చిన్నారావు అన్నారు. పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం, జెడ్పీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతుందన్నారు. మండలంలో 1,833 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

వక్ఫ్ బిల్లును టీడీపీ వ్యతిరేకించాలి

మా అధ్యక్షుడు జవహర్ అలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ముస్లింల పక్షపాతిగా టీడీపీని చెప్పుకోవాలంటే వక్ఫ్ బిల్లును పార్లమెంట్‌లో వెనక్కు తీసుకునేలా వ్యవహరించాలని ముస్లిం అడ్వకేట్ అసోసియేషన్(మా) కోరింది. పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం పొందకుండా ఆపగల బలం టీడీపీ కూటమికి ఉందని, అందువల్ల ముస్లిం ప్రయోజనాలు కాపాడాలని మా అధ్యక్షుడు మహమ్మద్ జవహర్ అలీ సూచించారు. స్థానిక జేఎన్‌టీయూకే వద్ద ఉన్న మేవా ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకమని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం చట్టరూపం కాకుండా ఉపసంహరించేలా చేయాలన్నారు. ఈ సవరణ బిల్లు వల్ల ముస్లిం ఆస్తులు, ఆ సమూహంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. ఈ సవరణల వల్ల వక్ఫ్ బోర్డులో కేంద్ర అజమాయిషీ పెరగడమే కాక, ఆస్తుల పరిరక్షణకు హానికరంగా మారుతాయన్నారు. ఈ బిల్లును వక్ఫ్ బోర్డుతో పాటు, ముస్లిం సంఘాలు, ఇతర పౌర సమాజ సంస్థలు వ్యతిరేకిస్తున్నాయని గుర్తు చేశారు. కేంద్రం ఏర్పాటు చేసిన జేపీసీలో ఎక్కువగా పాలక పక్షాలు వారే ఉండటం వల్ల ఈ బిల్లు వారికే అనుకూలమయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ కుటిల యత్నాన్ని పార్లమెంట్‌లో టీడీపీ కూటమి ప్రభుత్వం అడ్డుకునేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మా సభ్యులు ఎస్.ఎజాజుద్దీన్, మహమ్మద్ ఇక్బాల్, ఇక్బాల్ అలీ, అల్తాఫ్ మహమ్మద్, మహమ్మద్ సియాజుద్దీన్, సయ్యద్ సాలార్, దీన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జవహర్ అలీ

మద్దతు ధరతో టమాటా కొనుగోళ్లు

ఉద్యాన శాఖాధికారి సత్య శైలజ

పిఠాపురం: టమాటా ధరలు పతనమైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మద్దతు ధర కేజీ రూ.8 చొప్పున రైతుల నుంచి వారి పొలాల వద్దే కొనుగోలు చేస్తున్నామని పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కె.సత్య శైలజ తెలిపారు. ఆమె బుధవారం గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో రైతుల నుంచి ఉద్యాన మార్కెటింగ్ శాఖ ద్వారా చేపట్టిన టమాటా కొనుగోళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాటిపర్తిలో రైతుల నుంచి నేరుగా వారి పొలాల వద్దే సుమారు 2 టన్నుల టమాటాను కొనుగోలు చేశామన్నారు. ఉద్యాన శాఖ, మార్కెటింగ్ శాఖల ఆధ్వర్యంలో పొలాలకు వెళ్లి, రైతుల నుంచి నేరుగా టమాటా కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏ గ్రామాల్లో టమాటా పంట ఉందో తెలుసుకుని, అక్కడే కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. టమాటా ధర పడిపోవడంతో ఆ రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున, వారిని ఆదుకునేందుకు మద్దతు ధర ఇచ్చి నష్ట నివారణ చర్యలు తీసుకున్నామన్నారు. ఆమె వెంట మార్కెటింగ్ శాఖ ఎస్టేట్ ఆఫీసర్ గోవిందరాజులు, కృష్ణారావు, ఉద్యాన శాఖ సహాయకులు, పలువురు రైతులు ఉన్నారు.


తాటిపర్తిలో టమాటా కొనుగోళ్లను పరిశీలిస్తున్న సత్య శైలజ

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

పిఠాపురం: మహా శివరాత్రి పుణ్య స్నానాలకు తరలి వచ్చిన భక్తులకు స్వచ్ఛంద సంస్థలు వివిధ సేవలందించాయి. భక్తులకు మజ్జిగ, మంచినీరు, ఫలహారాలు, భోజనాలు విస్తృతంగా పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ శ్రీరామ హిందూ ఆధ్యాత్మిక సమాజ సేవా సంఘం తరఫున వ్యవస్థాపక అధ్యక్షులు విజయ జనార్దనాచార్యులు పాదగయ క్షేత్రానికి వచ్చే భక్తులకు మాధవస్వామి కోనేరు వద్ద వెయ్యి మందికి పులిహోర పంపిణీ చేశారు. సహృదయ మిత్రమండలి ఆధ్వర్యంలో స్థానిక పాత ఎమ్మార్వో ఆఫీస్ వద్ద ఉచిత ఆరోగ్య, అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. పలు సంస్థల ఆధ్వర్యంలో అన్నపానీయాలు పంపిణీ చేశారు. జనసేన నాయకులు మజ్జిగ, మంచినీరు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ కపుల్స్ గొల్లప్రోలు మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో షిరిడీసాయి గొల్లపూడి ట్రస్ట్ ఆర్థికసాయంతో గొల్లప్రోలు మెయిన్ రోడ్డులోని షిరిడీసాయి ఆలయం వద్ద సుమారు 5 వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.


పిఠాపురంలో పులిహోర పంపిణీ చేస్తున్న సభ్యులు